# పద్మవ్యూహం

"అమ్మా!"

"ఎవరూ?"

"నేనమ్మా. నీ ప్రాణంలో ప్రాణాన్ని నీ బుల్లి పొట్టలోని బుజ్జి యువరాజుని"

"నువ్వట్రాకన్నా, బాగున్నావా నాయనా"

"ఓ—నాకిక్కడెంతో బాగుందమ్మా. ఎంతో మెత్తగా హాయిగా, సుఖంగా, శాంతిగా స్వర్గంలోలా వుందమ్మా"

"సరిగ్గా చెప్పేవు. నువ్విప్పుడున్న లోకాన్నే స్వర్గం అంటార్రా చిన్నా"

"ఎప్పటికీ ఇలాగే ఇక్కడే వుండిపోవాలనుందమ్మా. ఈ స్వర్గానుభూతిని పోగొట్టుకోవాలని లేదమ్మా"

"అలాగనకూడదురా బుజ్జీ. తొమ్మిది నెలలకు మించి ఆ లోకంలో వుండటానికెవరికీ అనుమతి లేదురా"

"వూహూ-నేనురాను"

"మా నాన్నవి కదూ, ఇంకో నెల రోజుల్లో మా ప్రపంచంలోకి వచ్చెయ్యాలి నాన్నా"

22)

"నాకు భయమేస్తోందమ్మా. నేను రాలేనమ్మా"

"తప్పురా బాబూ. అలా అనొద్దు. అయినా కన్నా-నీ స్నిగ్ధమోహన రూపం నీ వెన్నెల బోసి నవ్వులు, నీ నల్లని అల్లరి కళ్ళు మాకు చూపించవూ?"

"నాకూ నిన్ను చూడాలనుందమ్మా. నీతో బోల్డు కబుర్లు చెప్పాలనీ నీ లాలిపాటలకి ఆదమరచి నిద్రపోవాలనీ. నీ అమృతం త్రాగి తరించాలనీ ఎంతో ఆశగా వుంది. ఆరాటంగా వుందమ్మా, కానీ...."

"చెప్పు నాయనా, ఆగిపోయావేం?"

"ఏవో భయాల, భూతాలు నన్ను భయపెదుతున్నాయమ్మా"

"పిచ్చినాన్నా, నా చల్లని ఒడిలేదూ? నాన్న వెచ్చని భుజాలులేవూ? అమ్మమ్మ భారతి విశాల ప్రాంగణం లేదూ? మేం నిన్ను కంటికి రెప్పలా కాపాడతాంరా. అర్థం లేని భయాలకి తిలోదకాలిచ్చి మా వంటపండించరా. అమ్మమ్మ పెదవులపై చిరునగవువై వర్ధిల్లరా."

"అమ్మా! నన్ను జాగ్రత్తగా కాపాడుతానంటున్నావేమిటమ్మా. కాపాడకపోతే. కాపాడలేకపోతే నాకేమైనా అవుతుందా? ఏ రాక్షసులైనా నన్నేమైనా చెస్తారా? చెప్పమ్మా చెప్పు."

"అబ్బే-ఏదో అవుతుందని కాదురా బుజ్జీ ఏమీ అవకూడదనంతే"

"ఏం? నాలాటి చిన్నారి పొన్నారి పిల్లలకి కల్లలెరుగని మల్లెల మనసులకి మీ లోకం మంచిది కాదా అమ్మా"

"అహహ అలాఅని కాదుగాని ప్రస్తుతం కలికి కాలమయ్యిందిరా. మంచి వాళ్ళకి చెడ్డదీ చెడ్డవాళ్ళకి మంచిదీ అయిపోయిందిరా. మనిషి గుండె కోటమీద స్వార్థపు జెండా ఎగురుతోందిరా. కులమత దురహంకారం మానవత్వపు పావురాన్ని ముక్కలుగా నరికి వీరవిహారం చేస్తోందిరా. ఏమని చెప్పను ఎంతని చెప్పను అమ్మమ్మ దీనాలాపన గురించి?"

"అమ్మా అమ్మా - ఏడుస్తున్నావా అమ్మా ఏడవకమ్మా, నువ్వే డిస్తే నాకూ ఏడుపొస్తుంది."

"నీ చిట్టిచేతుల్తో నాకన్నీళ్ళు తుడువాలని ఆత్రపడుతున్నావా బుజ్జీ. నీ కోసం. నీలాటి వారికోసం నేనూ. అమ్మమ్మా అంతా ఒళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూస్తున్నాంరా. వేగిరం రారా నాబంగారు తండ్రీ"

"వచ్చేస్తాసుగానీ-అమ్మా-మీ లోకం అదే మన లోకం గురించి కొంచెం చెప్పవూ, మా అమ్మవికదూ?!

"తినబోతూ రుచి అడక్కూడదురా"

"మాట దాటెయ్యకమ్మా, ఆ లోకం గురించి తెలుసుకోవాలని నా కెంతో ఆరాటంగా వుంది తెలుసా?"

"వూహించ గలన్రా"

"మరి చెప్పమ్మా"

"చెప్పాల్సిన సమయంరాగానే అన్నీ చెబుతాన్రా. నీ చుట్టూ అల్లుకున్నదాన్ని, నీ రాకకై వెర్రిగా ఎదురు చూస్తున్నదాన్ని, నీ వల్ల తరించాలనుకుంటున్నదాన్ని, నీకు చెప్పకుండా వుంటానా చిట్టితండ్రీ"

"చెప్పకపోతే దాచుకో. నేన్నీతో మాట్లాడనే మాట్లాడను"

"కోపం వచ్చిందా బుజ్జీ. మా వరాల పంటకి కోపం రానేరాదు. అందుకనే మంచి పేరు పెట్టాలని ఆలోచిస్తున్నాంరా.

"ఏం పేరమ్మా ?"

"ఎవరైనా గొప్పవారి పేరు పెడదామనుందిరా"

"కనీసం వారి గురించైనా చెప్పమ్మా. ప్లీజ్ చెప్పమ్మా...."

"సరే చెబుతాను విను. అహింసా యోధుడు గాంధీ, సింహధీరుడు బోస్, మృత్యువుని చూసి నవ్విన భగత్సింగ్, మన్యం వీరుడు అల్లూరి, గుండెకి గుండె చూపిన టంగుటూరి, పొట్టివాడైనా గట్టివాడైన లాల్‌బహ

దూర్, మరో గాంధీ జయప్రకాష్, నారీ రత్నం విజయేందిర ఇందిర, త్యాగధనుడు సుందరయ్య, ఎందరో ఇంకెందరో మహానుభావులకి జన్మనిచ్చిన పుణ్య జనయిత్రి తల్లిభారతి"

"నీ మాటలు వింటోంటే నా ఒళ్ళు గర్వంతో పొంగిపోతోంది. ఆనందంతో పులకించి పోతోంది. ఎప్పుడెప్పుడా లోకంలో కొచ్చి వాళ్ళం దర్నీ చూద్దామా అని పువ్విళ్ళూరిపోతున్నా నమ్మా"

"సారీ రా బాబూ. వాళ్ళంతా ఇప్పుడు లేరు...."

"ఎక్కడికెళ్లేరు ?"

"వాళ్లందర్నీ దేవుడు తీసుకుపోయాడు"

"ఎందుకని ?"

"దేవుడి కొలువులో గొప్పవారికి కరువొచ్చిందేమో"

"మరి ... మరేమో.... ఇప్పుడలాటి వారెవరూ లేరా అమ్మా నేనలాటివాళ్లని ఒక్కర్నైనా చూళ్ళేనా అమ్మా ?"

"దిగులు పడకురా కన్నా. అలాటి వాళ్ళు ఎక్కడో వుందే వుంటారు."

"వాళ్ల చిరునామా నీకూడా తెలీదా అమ్మా"

"వాళ్లకి ఎడ్రస్సులుండవురా అందుకే తెలీదు"

"నాకు చాలా దిగులుగా వుందమ్మా. నేను నష్టజాతకుడ్నేమో అన్పిస్తోంది"

"అయ్యయ్యో- అవేం మాటల్రా అలా ఎప్పుడూ అనుకోకురా. ఆవేశకావేషాలు చుట్టేస్తేనేం. అధర్మం, అరాచకం రాజ్యమేలు తుంటే నేం ఇది పుణ్య భూమిరా. పవిత్ర గడ్డరా. నువ్వు గర్వించాల్సిన మాతృ భూమిరా. నువ్వు భావిభారత భాగ్యానివిరా. నీలాంటి వారి మీదే బోలెడు ఆశలు పెట్టుకుని ప్రస్తుతం గరళం త్రాగుతున్నాం రా."

"మరెందుకంత నిరాశగా, నిస్పృహగా మాట్లాడుతున్నావమ్మా ?"

"అవి పెద్ద విషయాలు. చిన్నవాడివి. చెప్పినా నీకర్థం కావురా!"

"అదిగో దాచేస్తున్నావ్"

"అహహ- అదికాదురా చిన్నా...."

"నాకు తెలిసిపోయిందమ్మా. నువ్వు పెద్ద పెద్దవి దాచేస్తున్నావు బుల్లి బుల్లివి చెబుతున్నావు"

"అసహాయురాల్ని. ఏం చెయ్యను చెప్పు ? పసిపూసి మారేడు కాయ చేసి నీ పసి మనస్సుని మభ్య పెట్టలేను కదా."

"పోనీలేమ్మా. నిన్ను నొప్పించన్లేమ్మా. అమ్మా- నాన్నగారేం చేస్తారమ్మా !"

"యంత్రాలు నడిపే కార్మికుడయ్యా."

"నువ్వేం చేస్తావమ్మా"

"పాఠాలు చెప్పే పంతులమ్మని"

"ఓహ్- నేను హాయిగా పెద్ద పెద్ద చదువులు చదివేసుకోవచ్చు. యంత్రాలతో ఆడుకోవచ్చు. భలే భలే"

"అంత సంతోషకరంగా లేవురా చదువులూ, ఉద్యోగాలూనూ. దొనేషన్లూ రిజర్వేషన్లూ తినెయ్యగా నీలాంటి వాళ్ళకి మిగిలేవి నూటికి ఒకటో రెండో!"

"అయ్యో! ఇంకెలా గమ్మా ?"

"అధైర్యపడకురా. ధైర్యే సాహసే లక్ష్మీ అన్నారు. నీ ప్రతిభే. నీకు శ్రీరామ రక్ష"

"నా ధైర్యానికి నా ప్రతిభకి అక్కడ విలువుంటుందంటావా అమ్మా. నిజం చెప్పు?"

"................"

"మాట్లాడవేమ్మా- కోపం వచ్చిందా ?"

"అహహ- దేవుడి కన్నా పవిత్రుడివి. నీ మీద కోపం ఏమిట్రా పిచ్చితండ్రీ. ఏదో ఆలోచిస్తూండి పోయానంతే"

"చెప్పమ్మా. చెప్పకపోతే నామీద ఒట్టే"

"అయ్యో ఒట్టేసి కట్టేశావు కదురా కన్నా"

"చెప్పమ్మా- ప్లీజ్...."

"నువ్వీ భూమ్మీద కొచ్చి వచ్చాక అడుగడుగునా ఎదురయ్యే విషపు ముళ్ళ గురించీ పాముల బుసల గురించీ, కత్తుల వంతెనల గురించీ, మందు పాతర్ల గురించీ, మారణాస్త్రాల గురించీ, బాంబు విస్ఫోటాల గురించీ ఆలోచిస్తూ భయపడుతున్నాను. భయపడుతూ ఆలోచిస్తున్నాను."

"నాకంటే ఎంతో పెద్ద దానివి. నీకూ్కడా భయమేనా అమ్మా ?"

"పిచ్చినాన్నా- అసలు బాధలూ భయాలూ, భ్రాంతులూ అన్నీ మావేరా. కడుపులో దాక్కున్న నిన్నే కత్తీ, ఏ ఆందోళన చుట్టుముడుతుందోనని భయం. ఆఫీసుకెళ్తొంటో ఏ బంద్, ఏ రాస్తారోకో విషపు నోరు తెరుస్తొందోనని భయం. కర్మాగారంలో నాన్నగారు పని చేస్తోంటే ఏ లాకౌట్, ఏ బాంబు బ్రద్దలవుతుందోనని భయం. నగరంలో ఎప్పుడే పైశాచిక శక్తి వీరవిహారం చేస్తుందోనని భయం. రాష్ట్రాన్ని ఎప్పుడే ఉద్యమం ఏ ఆందోళన, ఏ స్వార్థం కుదిపి అతలా కుతలం చేస్తుందోనని భయం. దేశాన్ని ఏ స్కాం, ఏ కుట్ర, ఏ స్కాండల్, ఏ యుద్ధం ఏ పదవీ లాలస ఏం చేస్తుందో ఎన్ని ఖండాలుగా నరక జూస్తుందోనని భయం. ప్రతి క్షణం భయం. బ్రతుకు. భయం భయం బ్రతుకు ఏం చెయ్యన్రా బాబూ. నాకూ చిన్న గుండె వుందిరా. దానికి స్పందన తెలుసురా"

"నాకూ భయమేస్తోందమ్మా ఆ రాక్షస లోకంలోకి రానేరానమ్మా"

"నువ్వు రాకపోతే వీళ్ళ రాతి గుండెల్లో ప్రేమ పూల నెవరు పూయిస్తార్రా. వీరి ఎడారి బ్రతుకుల్లో జీవనది నెవరు పారిస్తార్రా ? వీరి చీకటి మనస్సుల్లో మమతా దీపాల నెవరు వెలిగిస్తార్రా ? నీ మీద వేనవేల

ఆశలు పెట్టుకున్న తల్లి భారతిని నిరాశ పాలు చేస్తావా? శాపగ్రస్తురాల్ని చేస్తావా?"

"నువ్వంటే నా కిష్టమమ్మా అందుకోసమైనా వస్తానమ్మా. అమ్మమ్మ కన్నీటిని తుడిచి కిలకిలా నవ్విస్తానమ్మా. గలగలా నవ్విస్తానమ్మా."

"ఎంత మాటన్నావురా తండ్రీ- నా ఆయుష్షు పోసుకుని వర్ధిల్లరా కన్నా"

"అమ్మా అమ్మా- ఆ కేకలూ గొడవలూ ఏంటమ్మా? ఏం జరుగుతోందమ్మా? నాకు భయమేస్తోందమ్మా. నా ఒళ్ళు కంపిస్తోందమ్మా...."

"తలుపులూ కిటికీలూ అన్నీ గట్టిగా బంధించి వస్తానుండ్రా బాబూ"

"ఏమ్మా- ఏమయ్యిందమ్మా. నీ గుండె గడియారం ఇంత గట్టిగా కొట్టుకుంటోందేం అమ్మా?"

"మత దురహంకారం విషం క్రక్కుతోందిరా. స్వార్థ రాజకీయం అగ్ని కీలల్ని సృష్టించి విలయతాండవం చేస్తోందిరా. విచ్ఛిన్న శక్తులు బాంబులతో జనం బ్రతుకుల్ని ప్రేలుస్తున్నాయిరా. అమానుషత్వం, పైశాచికత్వం వీధుల్లో వీర విహారం చేస్తోందిరా. అయినా నీకేం ఫర్లేదురా బాబూ. నా కంఠంలో ప్రాణం వుండగా నీకేం కానివ్వన్రా కానివ్వను"

"వాళ్ళంతా ఎందుకలా రాక్షస నృత్యం చేస్తున్నారమ్మా"

"మసీదు కూల్చారని కొందరు, మందిరం కట్టాలని కొందరు ఆవేశకావేషాలకి లోనై హింసాగ్నుల్లో సమిధలవుతూ మానవత్వాన్ని బుగ్గి చేస్తున్నారు"

"అయ్యయ్యో- అదేం పనమ్మా. మసీదూ, మందిరమూ రెండూ దేవుడి గుళ్ళే కదా."

"అవునయ్యా"

"దేవుడొక్కడే కదా ?"

"ఒక్కడే అంటారు హిందువులు. ఒక్కడే అంటారు ముస్లిములు· కానీ ఆ ఒక్కరూ వేరువేరంటారు మతదురహం కారులు"

"మతం ఏమంటుదమ్మా ?"

"కలిసి బ్రతకమంటుంది. మానవసేవే మాధవసేవ అంటుంది· మానవత్వం నిలిచి వెలగాలంటుంది"

"మరెందుకా మాటలు వినరమ్మా ? మానవ కళ్యాణం కోసం ఎందుకు నడుం బిగించరు ?"

"మతం మత్తులో కూరుకుపోయి రాజకీయపుటుచ్చులో చిక్కుకుపోయి స్వార్థపు ఊబిలో పీకలదాకా దిగబడిపోయారు బాబూ"

"వీళ్ళని చూసి దేవుడు కన్నీరు మున్నీరుగా విలపించడూ ?"

"విలపిస్తూనే వుండి వుంటాడయ్యా తన సృష్టి తన చేతులు దాటిందని !"

"మరి దేవుడు చూస్తూ వూరుకుంటాడా అమ్మా ?"

"ఆ సంగతి నువ్వే చెప్పాలి బాబూ. దేవుడు నీకు కూతవేటు దూరంలో వున్నాడు కదయ్యా"

"ఎంత పిలిచినా దేవుడు పలకటం లేదమ్మా"

"అవున్లే. దేవుడికి దూరంగా మాకు దగ్గరగా వచ్చేశావు కదా!"

"అమ్మా- నేనొకటడగనా ?"

"అడుగు బాబూ"

"మనం ముస్లిములమా, హిందువులమా ?"

"నాన్న ముస్లిం, నేను హిందూ"

"మరి నేను ?"

"భారతీయుడివి"

* * *

మత దురంహంకారుల ఆవేశాగ్ని కీలల్లో చిక్కుకొని నగరం హాహాకారాలు చేస్తోంది.

దుష్టశక్తులు మత కత్తులు ఝళిపిస్తూ ఆ నిండు గర్భిణీ మీద దాడి చేశాయి. పొట్ట చీల్చాయి. వికటాట్టహాసం చేశాయి.

పసిగుడ్డుని భూమిపై జార్చి అసువులు బాసిందామె.

రక్తసిక్త భూమిని తాకీ తాకగానే కేర్‌మన్నాడు బిడ్డ.

ఈ ప్రపంచపు పద్మ వ్యూహంలో ప్రవేశించటమే తెలుసా బాల అభిమన్యుడికి!

వాడికేం కానున్నదో ఎవరు చెప్పగలరు ?

వాడికేమీ కాకుండా ఎవరు హామీ ఇస్తారు ?

వాడి బంగారు భవిష్యత్తుకు ఎవరు పూచీ పడతారు ?

"ఎవరు ? కౌన్ ? హూ ?

మనిషా ? దేవుడా ? దేశమా ?

—o—

(విశాలాంధ్ర. సెప్టెంబరు'93)